స్కెచ్

# వైవాహికము

పి. యస్. దేవి

"సుమటన్ వ్రాసిన వ్రాలు తప్పగలదే, నూరేండ్లు చింతించినన్!" నా నుదుటి వ్రాతను మించి యెక్కువ రమ్మంటే యేదైనా యెలా వస్తుంది? నా జీవితములో సుఖమనేది గగనకుసుమమేనా? నా పెండ్లిఅయి, అయిదు సంవత్సరాలైంది. ఈ అయిదుసంవత్సరాలలో నే ననుభవించని కష్టమంటూ లేదు. చిన్నతనములో అమ్మ నాన్నలచాటున పెరిగినన్నాళ్ళు యేం సుఖం అనుభవించానో కష్టమనేది లేకుండా. అంతే.

అసలు నాన్నదే పొరపాటేమో! దూరాలోచన లేకుండా, ఇల్లాంటి సంబంధం చెయ్యడం! నిజానికి ఆయన తప్పు యేముంది, ఒక్కగాను ఒక్కకొడుకు. కావలసినంత ఆస్తి వుంది. నా అల్లుడు ఉద్యోగము చేసినా చెయ్యకపోయినా రాజాలాగా జరుగుతుంది, అనే ఉద్దేశ్యముతో ఉన్న నాలుగు ఎకరాలపొలమూ అయినకాడికి తెగనమ్మి, ఆరువేల రూపాయలు కట్నం పోసి ఐదురోజులు అతి వైభవంగా పెండ్లి చేశారు. నేనూ నా భర్తా కారులో షైర్లు కొడుతూవుంటే తనతోటి గుమాస్తాతో ఆ సెర్జిసూటులో వున్నాయన నా అల్లుడని చెప్పి, ఆయన మీ అంత అదృష్టవంతుడు లేడండి, వజ్రపు తునకలాంటి అల్లుడండి, అని పొగుడుతూంటే గర్వపడదా మనుకున్నాడు నాన్న. నా భావిజీవితములో యేకొరతా లేని సుఖమనుభవిస్తున్నానని ఊహించాడు ఇంత ఆస్తి వున్న సంబంధం చేశానుగదా! డబ్బువుంటే అన్నీ వాటంతటవే లభిస్తాయనే భ్రమపడ్డాడు. ఇంత డబ్బున్నవాళ్ళు వరకట్నముకొరకై అంత పట్టుదలపట్టి, ఆరువేలకు చిల్లిగవ్వ తక్కువయినా సంబంధం పొసగదు. అని (పెండ్లికి ముందు) మా మామగారు, మాట్లాడిన మాటలనుబట్టి అయినా గ్రహించలేదు నాన్న, ఆయన పరమ లోభి అని.

పెండ్లిలో లాంఛనాలు సరిగా జరుగలేదని, మా అత్తగారి, మామఅన్న భార్యకు, అప్పగింతల చీర ఇవ్వలేదని, ఇల్లాంటి స్వల్పకారణాలు మా అత్తగారు మరచిపోకుండా, నేను కాపురానికి వచ్చింది మొదలు నా మూలమున అవన్నీ జరిగినాయనీ, నాలాంటి దరిద్రురాలు మరి వుండబోదనీ, హీనాతిహీనంగా, ఇల్లాంటి బాధలు పెడతారని, నాన్న కలలోనైనా అనుకున్నారా? ఎన్నడో, పెండ్లిసమయములో, తెలిసో, తెలియకో, నా తల్లిదండ్రులు లాంఛనాలు సరిగా జరుపని నేరానికి, నేను ఆ జన్మాంతము ఇల్లాంటి బాధలు అనుభవించ వలసిందేనా? నన్ను గురించి నాన్న, అమ్మ, యెంత కుమిలిపోతున్నారో? అమ్మ, నాన్న, నన్ను చూడటానికి నాలుగునెలలకొకసారి వస్తే, మా అత్తగారు అమ్మతో మాట్లాడితే గౌరవలోపమని పలుకరించవయినా, పలుకరించదు. ఇక నాన్న విషయం చూద్దామా అంటే, మా మామగారు నాన్నను చూడగానే యేం పనిమీద వచ్చారు! అని అడుగుతారు. పోనీ, నా భర్తయినా ఇంటికి వచ్చిన నాన్నను ఆప్యాయంగా పలుకరించి, మర్యాద చేస్తారాఅంటే, వాళ్ళ తల్లిదండ్రుల ఆజ్ఞ లేకుండా, యేపనీ చెయ్యటానికి స్వతంత్రంలేదు. అమ్మ, నాన్న ఈ పరిస్థితులన్నీ చూసి మరుబండికి తిరిగి వెళ్తారు. "వెళ్లొస్తా నమ్మా ధైర్యంగా వుండు, దిగులుపడొద్దు" అని హెచ్చరించి వెళ్ళితే, అమ్మ వెళ్ళిన గంట వరకూ నాకు ఆపుకున్నా ఆగకుండా దుఃఖమొస్తుంది.

ఈ విషయం మా అత్తగారు కనిపెట్టి, ఆతల్లి వచ్చి యేమేమో నూరిపోసింది. ధైర్యంగా వుండమని హెచ్చరించటానికి ఇక్కడ యేమంత

రాసి, రంపాన పెట్టుతున్నామనీ, అల్లాంటి మాటలు మాట్లాడాలి. తన భాగ్యానికి, తన మొగుడు దర్జాను, సిగ్గులేకుండా మాట్లాడ వస్తుంది. నా సాటివాళ్ళతో నా వియ్యపురాలని చెప్పుకోటానికి గూడా సిగ్గుగా వుంటుంది. ఇంతకూ మా దురదృష్టముకొద్దీ దొరికింది ఈ సంబంధం. నేను మొదట్లోనే ఈ సంబంధం వద్దని చెబితే ఆయన విన్నాడుగాదు. పిల్ల అందమయినదనీ, చదువుకున్నదనీ, మోజుపడ్డారు ఆయన. అవతల సోమయ్యగారు, యెనిమిదివేల రొక్కమూ, తక్కిన లాంఛనాలు, అన్నీ జరుపుతానంటే, పిల్ల నలుపనీ, చెముడుందనీ. వప్పుకోలేదు ఆయన అప్పుడు. అందముంటే, కొరుక్కు తింటున్నామా? అని నడగండ్ల వర్షము కురిపిస్తారు.

అమ్మ వెళ్ళిందన్న విచారమూ, ఆమె అన్న మాటల కష్టమూ, ఒక గంట స్వేచ్ఛగా నాలో నేను యేడిస్తేగాని తగ్గవు.

ఇవన్నీ, నా భర్తవద్ద మొరపెట్టుకుంటేనన్ను అంటేనే మారుచెప్పటానికి, నాకు స్వాతంత్ర్యము లేదు. అల్లాంటప్పుడు, నిన్ను అన్నదానికి, యేంచెయ్య మంటావు? నేను స్వాతంత్ర్యంగా జీవించగలిగిననాడు, వాళ్ళమాటకు యెదురు చెప్పటానికి సాధ్యమౌతుంది. ఆ రోజువరకూ నేను నన్నుగురించి నీవు సహించివుండవలసిందేనని సమాధాన పరుస్తారు. ఇప్పుడిప్పుడు ఆయనతో చెప్పినందువలన ప్రయోజనం శూన్యమని, నాలో నేనే కృశించిపోతున్నాను.

నాలాంటిఆడపిల్లలనుగన్న తలిదండ్రులందరూ ఇలా పిల్లలను పెంచి, పెద్దచేసి, శక్తికి మించిన, వరకట్నాలుపోసి, వరులను తెచ్చి వివాహం చేస్తే యేదో పెండ్లిలో చిన్న లోపములు జరిగినయ్యనో, తమ అబ్బాయికి ఈ సంవత్సరం, ఆరువేలు ఇచ్చి పిల్లనిస్తే, తమ ప్రక్కింటి, ఆమె కొడుక్కు మరుసంవత్సరంలో తొమ్మిది వేలుఇచ్చి పిల్లనిస్తే, అయ్యో ఈ సంవత్సరం ఆగితే మనకుగూడా తొమ్మిదివేలూ వచ్చేవే, మూడు వేలరూపాయలు నష్టమే, అనే దురాశా పూరితులైన వరుల తలిదండ్రులచే ఇలా హేయాతి హేయంగాచూడ బడవలసిందేనా? ప్రపంచం అంతా ఇలాగే వుందా? లేక నా పూర్వపుణ్యఫలమా ఇది.

అసలు దీనికంతకూ, నా భర్తే ముఖ్యకారణము. తనకు స్వాతంత్ర్యజీవనమునకు తగినపరిస్థితులేర్పడకముందే తండ్రి ఆస్తిమీద ఆధారపడి, తనకు దూర సందులేదు మెడకొక డోలు అను సామెతను సార్థకపరుస్తూ నన్ను పెండ్లాడటమనేది, యెంతయినా పొరపాటు. ఆయన యెన్నడయినా, ఇలా సునిశితంగా ఆలోచించారా నా పరిస్థితులను గురించి ? స్వార్థప్రపంచము.

అయినా ఒకరి ననవలసిన పనేముంది. నా దురదృష్టానికి చింతపడవలసిందేగాని తక్కువ నోములు నోచి యెక్కువ ఫలము రమ్మంటే యెలా వస్తుంది. ఏనాటికైనా మంచి రోజులంటూ వున్నయ్యా నా జీవితములో ? అని లక్ష్మి తన గత జీవితఘట్టాలలోని దృశ్యాలు కళ్ళకుకట్టినట్లు భావప్రపంచములో కనిపిస్తూంటే వాటిని విస్మరించ శక్తిలేక వాటినే తిరిగి తిరిగి మననంచేస్తూ దుఃఖిస్తున్నది.

ఇంతలో లక్ష్మి అత్తగారైన శాంతమ్మ "ఏమే లక్ష్మి ఇంకా ఆ పనిలోనే వున్నావుటే, గంటన్నర అయింది మొదలుపెట్టి. ఇలా పనులు చేస్తే కాపురాలు యెలా గడుస్తాయి? ఎంత చెప్పినా వినవు. ఎంత అనకుండా వుందామన్నా నాచేత యేదోకటి అనిపించటానికే చేస్తావు. నా మంచి దక్కుతుందేమోనని. లే, కళ్ళు వప్పగించి అలా చూస్తావేం, ఆరుగంటలయింది, చీకటిపడుతోంది. ఆ బియ్యం నాకిచ్చి వంట ప్రయత్నం చెయ్యి."

అత్తగారి వురుముల వర్షంతో లక్ష్మి మనసులోని గత దృశ్యాలన్నీ వర్షము వెలిసిన తదుపరి మేఘశకలాలల్లే విచ్చిపోయినయి. లక్ష్మి భారమైన హృదయంతో వంట ప్రయత్నంలో మునిగిపోయింది.